క్లుప్తంగా

ఎస్సైకి సన్మానం



ఖానాపురం : స్థానిక ఎస్సై రఘుపతిని కాంగ్రెస్ పార్టీ నాయకులు శుక్రవారం పుష్పగుచ్ఛం అందజేసి సన్మానించారు. కార్యక్రమంలో ఆ పార్టీ మండల అధ్యక్షుడు హరిబాబు, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఎలగందుల రాజు, మాజీ ఉపసర్పంచ్ మీసం రవీందర్, తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలకు అవార్డు



నల్లబెల్లి : మండలంలోని నారక్కపేట, నందిగామ అంగన్‌వాడీ టీచర్లు బంధం వెంకటలక్ష్మి, సుజాత ఉత్తమ అంగన్‌వాడీ టీచర్లుగా జిల్లా కలెక్టర్ ప్రావీణ్య, జిల్లా స్త్రీ శిశు సంక్షేమ శాఖ అధికారి శారద చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. అలాగే రుద్రగూడెం, రాంతీర్థం అంగన్‌వాడీ సెంటర్ల ఆయాలు అంజమ్మ, సూరమ్మ ఉత్తములుగా ఎంపికై అవార్డులు అందుకున్నారు. ఈ సందర్భంగా వారిని సీడీపీఓ రాధిక, సూపర్‌వైజర్లు ఝాన్సీరాణి, శ్యామల దేవి అభినందించారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత



వర్ధన్నపేట : మండలంలోని ఇల్లంద గ్రామ శివారులోని ఆకేరు వాగు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు రెండు ట్రాక్టర్లను పట్టుకుని సంబంధిత వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఆకేరు వాగు నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇసుకను తరలిస్తే భూగర్భ జలాలు అడుగంటి పోతాయని చెప్పారు.

సోషల్ ఆడిట్‌పై సమీక్ష

దుగ్గొండి : జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా తలపెట్టిన సోషల్ ఆడిట్‌పై మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం సమీక్షించారు. గ్రామాల వారీగా జరిగిన పనులకు సంబంధించిన ఎంబీ రికార్డులు, మస్టర్లను సోషల్ ఆడిట్ బృందానికి అందజేశారు. గ్రామాల వారీగా తనిఖీ చేసి సభలు నిర్వహించి తదనంతరం మండల ప్రజావేదిక నిర్వహించనున్నట్లు ఎస్సార్పీ సుశీల తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ లెక్కల అరుంధతి, ఎంపీఓ శ్రీధర్‌గౌడ్, ఏపీఓ శ్రీనివాస్, ఈసీ రాజు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ఖానాపురం : మండలవ్యాప్తంగా నేడు (శనివారం) విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ సంపత్ మీడియాకు శుక్రవారం తెలిపారు. రెండో శనివారం నేపథ్యంలో సబ్‌స్టేషన్లలో మరమ్మతులు చేయనున్నట్లు పేర్కొన్నారు. ఉదయం 8 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని వివరించారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

చెన్నారావుపేట : చెన్నారావుపేట, ఉప్పరపల్లి సబ్‌స్టేషన్ల పరిధిలో నేడు ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు డీఈఈ శ్రీధర్, ఏఈ జోగానంద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రెండు సబ్‌స్టేషన్ల పరిధిలో విద్యుత్ మరమ్మతులు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

నెక్కొండ : మండలంలోని నెక్కొండ, రెడ్లవాడ, అలంకానిపేట, నాగారం విద్యుత్ సబ్‌స్టేషన్లలో మరమ్మతుల నేపథ్యంలో ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం 12.30 వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని డీఈ (ఆపరేషన్స్) శ్రీధర్ ఓ ప్రకటనలో తెలిపారు. ఆయా సబ్‌స్టేషన్ల పరిధిలోని గ్రామాల విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

దుగ్గొండి : మండలంలోని రేకంపల్లి సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల నేపథ్యంలో నేడు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ రామకృష్ణ తెలిపారు.

విద్యార్థులు రాణించాలి

దామెర : విద్యార్థులు చదువులో రాణించి ఉన్నతస్థాయిలో స్థిరపడాలని డిస్నీల్యాండ్ టెక్నో పాఠశాల ముఖ్య సలహాదారులు మల్లయ్య, సదయ్య, లక్ష్మీనివాసం సూచించారు. మండలంలోని ఒగ్లాపూర్ డిస్నీల్యాండ్ టెక్నో పాఠశాలలో శుక్రవారం స్వయంపాలన దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించి పాఠాలు బోధించారు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ శోభారాణి, డైరెక్టర్లు రాకేష్‌భాను, దినేష్‌చందర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వైభవంగా శివపార్వతుల కల్యాణం

నర్సంపేట రూరల్ : శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయంలో అభిషేకం చేస్తున్న భక్తులు



వర్ధన్నపేట : శివాలయంలో శివపార్వతుల కల్యాణం నిర్వహిస్తున్న వేద పండితులు



ఖానాపురం : ధర్మరావుపేటలో పూజ చేస్తున్న జెడ్పీటీసీ దంపతులు



జిల్లాలోని నర్సంపేట, వర్ధన్నపేట, ఖానాపురం, పర్వతగిరి, నల్లబెల్లి, చెన్నారావుపేట, దుగ్గొండి, సంగెం, నెక్కొండ, రాయపర్తి మండలాల్లో మహాశివరాత్రి ఉత్సవాలను శుక్రవారం కనుల పండువగా నిర్వహించారు. ఊరూరా ఆలయాల్లో శివపార్వతుల కల్యాణాన్ని ఘనంగా చేపట్టారు. ప్రజాప్రతినిధులు, ప్రజలు ఉదయం నుంచే ఆలయాలకు చేరుకుని అర్చనలు, అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు తాగునీటి, ఇతర మౌలిక సదుపాయాలను ఆలయ కమిటీలు ఏర్పాటు చేశాయి.

–సాక్షి నెట్‌వర్క్



చెన్నారావుపేట : సిద్ధేశ్వరాలయంలో..



నల్లబెల్లి : గుండ్లపహాడ్‌లో..



రాయపర్తి : శివపార్వతులను కల్యాణానికి తీసుకొస్తున్నఅర్చకులు, గ్రామస్తులు



సంగెం : పూజ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే ధర్మారెడ్డి



దుగ్గొండి: నాచినపల్లి శివాలయంలో..



పర్వతగిరి : రామలింగేశ్వరస్వామి ఆలయంలో..



నెక్కొండ : ఆంజనేయ స్వామి ఆలయంలో..



నెక్కొండ : నాగాభరణం అందిస్తున్న ఆర్యవైశ్యులు

‘కేంద్ర’ పథకాలను వివరించండి

నర్సంపేట : కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజలకు వివరించాలని బీజేపీ నియోజకవర్గ చేరికల కమిటీ ఇన్‌చార్జ్ డాక్టర్ గోగుల రాణాప్రతాప్‌రెడ్డి సూచించారు. పట్టణంలోని ఆ పార్టీ కార్యాలయంలో పట్టణ అధ్యక్షుడు శీలం రాంబాబు అధ్యక్షతన శుక్రవారం నిర్వహించిన ముఖ్యకార్యకర్తల సమావేశానికి ముఖ్యఅతిథులుగా రాణాప్రతాప్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు కంభంపాటి పుల్లారావు, నియోజకవర్గ కన్వీనర్ నర్సింహరాములు హాజరయ్యారు. ఈ సందర్భంగా రాణాప్రతాప్‌రెడ్డి మాట్లాడారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి పేదల సంక్షేమానికి అనేక పథకాలు తీసుకొచ్చి అమలు చేస్తోందని చెప్పారు. రాష్ట్రంలో చేపట్టిన అనేక సంక్షేమ పథకాలకు కేంద్ర ప్రభుత్వం నిధులు కేటాయించిందని తెలిపారు. బీజేపీతోనే ప్రజలకు సుపరిపాలన అందుతుందని చెప్పారు.



సమావేశంలో మాట్లాడుతున్న రాణాప్రతాప్‌రెడ్డి

పార్టీ నాయకులు, కార్యకర్తలు కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. తద్వారా పార్టీని బూత్ స్థాయి నుంచి మరింత బలోపేతం చేయాలని చెప్పారు. రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో ప్రతీఒక్కరు నియోజకవర్గం నుంచి అత్యధిక ఓట్లు పడేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు.

విద్యార్థుల వికాసమే ధ్యేయం



విద్యార్థులకు బహుమతి అందజేస్తున్న కరస్పాండెంట్ రమేశ్, తదితరులు

నర్సంపేట : విద్యార్థుల వికాసమే ధ్యేయంగా వికాస తరంగిణి ఆధ్వర్యంలో కార్యక్రమాలు చేపడుతున్నట్లు మదర్స్‌ల్యాండ్ స్కూల్ కరస్పాండెంట్ రమేశ్ తెలిపారు. పట్టణంలోని ఆ స్కూల్‌లో 8, 9వ తరగతుల విద్యార్థులకు వికాస తరంగిణి నర్సంపేట శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం ప్రజ్ఞ, సంస్కార వికాస్‌పై అవగాహన కల్పించి క్విజ్ పోటీలు నిర్వహించారు. ప్రజ్ఞ కోఆర్డినేటర్ కృష్ణారావు ప్రశ్నలు అడిగారు. రంగనాథస్వామి మార్కుల జాబితాలో ఉండగా యువ వికాస్ రాజశేఖర్, ఆర్థిక బాధ్యులు శ్రీధర్ పాల్గొన్నారు. అనంతరం విజేతలకు స్కూల్ కరస్పాండెంట్ రమేశ్, శ్రీనివాస్‌రావు, కిరణ్ బహుమతితోపాటు ఆధ్యాత్మిక గ్రంథాలు అందజేశారు. అనంతరం రమేశ్ మాట్లాడారు. ఈనెల 10న వికాస తరంగిణి ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు పరీక్షల్లో ఉన్నత గ్రేడ్ కోసం అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు తెలిపారు. రంగనాథస్వామి విద్యార్థులచే జైశ్రీరామ్ భజన చేయించారు. విద్యార్థుల్లో భక్తిభావం పెంచేలా రెండ్రోజులపాటు సదస్సు నిర్వహించనున్నట్లు తెలిపారు.

గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహిస్తాం



నర్సంపేట రూరల్ : కిట్‌లు అందిస్తున్న రాజిరెడ్డి



నల్లబెల్లిలో..

నర్సంపేట రూరల్ : గ్రామీణ యువ క్రీడాకారులను ప్రోత్సహిస్తామని డీఆర్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు దాసరి రాజిరెడ్డి తెలిపారు. ఆ ట్రస్ట్ ఆధ్వర్యంలో మండలంలోని కమ్మపల్లి, చంద్రయ్యపల్లి, బాంజీపేట గ్రామాలకు చెందిన క్రీడాకారులకు శుక్రవారం ఆయన క్రికెట్ కిట్‌లు అందజేసి మాట్లాడారు. గ్రామీణ ప్రాంత యువ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు నర్సంపేట మండలంలోని దాసరిపల్లికి చెందిన దాసరి సాంబరెడ్డి జ్ఞాపకార్థం ట్రస్ట్ ఆధ్వర్యంలో తోడ్పాటు అందిస్తున్నట్లు తెలిపారు. యువత క్రీడల్లో రాణించాలని సూచించారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

నల్లబెల్లి : మండల కేంద్రంలో క్రీడాకారులకు డీఆర్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో క్రికెట్ కిట్‌లు అందజేశారు. అనంతరం ట్రస్ట్ వ్యవస్థాపకుడు రాజిరెడ్డి మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాలకు చెందిన యువత క్రీడల పట్ల ఆసక్తి పెంచుకుని సాధన చేయాలని సూచించారు. తద్వారా ప్రతిభ చాటి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని చెప్పారు. యువతను ప్రోత్సహించడానికి ట్రస్ట్ ఎళ్లవేళలా అందుబాటులో ఉంటుందని చెప్పారు. ట్రస్ట్ సేవలను యువత వినియోగించుకుని అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు బుడిగొండ భిక్షపతి, అజ్మీర సురేశ్, గుమ్మడి వేణు, మామిండ్ల గోపీ, మేడిపల్లి రాజు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మహిళా దినోత్సవం

జిల్లాలోని నర్సంపేట, చెన్నారావుపేట, ఖానాపురం, వర్ధన్నపేట, సంగెం, తదితర మండలాల్లో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. మహిళా ప్రజాప్రతినిధులు, అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, తదితరులు కేక్ కట్ చేశారు. మహిళా ఉద్యోగులు, స్వచ్ఛంద సంస్థల సభ్యులను సత్కరించారు. మహిళలకు ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు.

–సాక్షి నెట్‌వర్క్



నర్సంపేట : సంఘమిత్ర మహిళా సభ్యులను సన్మానిస్తున్న అధ్యక్షుడు గొంగళ్ల అశోక్



చెన్నారావుపేట : మహిళా వీఓఏలను సన్మానిస్తున్న సభ్యులు



నర్సంపేట : మాంటిస్సోరి స్కూల్‌లో కేక్ కట్ చేస్తున్న డైరెక్టర్ ఊర్మిళాదేవి



ఖానాపురం : పీహెచ్‌సీలో కేక్ కట్ చేస్తున్న మహిళా అధికారులు



వర్ధన్నపేట : రిటైర్డ్ ఉపాధ్యాయురాలు రాజేశ్వరిని సన్మానిస్తున్న మహిళా సభ్యులు

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి



సమావేశంలో మాట్లాడుతున్న కవిత

నెక్కొండ : మహిళలు అన్ని రంగాలోరాణించాలని ఎన్ఎఫ్ఐడబ్ల్యూ జిల్లా అధ్యక్షురాలు పాలక కవిత ఆకాంక్షించారు. మండలంలోని పనికర గ్రామ శివారులోని గుడిసెల ప్రాంతంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సమాజంలో మహిళల ప్రాధాన్యత నానాటికీ పెరుగుతోందని చెప్పారు. మహిళలు అవకాశాలను వినియోగించుకుని ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధి చెందాలని సూచించారు. చట్టసభలో 33 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తొలుత సంఘం జెండాను ఆవిష్కరించారు. సమావేశంలో సంఘం మండల అధ్యక్షురాలు కనుకుల దేవపాల, నాయకులు విక్టోరియా, సుమలత, రవళి, రమ, పద్మ, బుచ్చమ్మ, సరిత, నీలమ్మ, సౌజన్య, సంపూర్ణ, శ్రీలత పాల్గొన్నారు.

విద్యార్థినులకు పరీక్ష ప్యాడ్‌ల పంపిణీ



దుగ్గొండి : మండలంలోని మల్లంపల్లిలోని కేజీబీవీలో టెన్త్ చదువుతున్న విద్యార్థినులకు ఎస్ఆర్ఐ సెల్ వ్యవస్థాపకుడు కూర్మాచలం అనిల్ జన్మదినం సందర్భంగా ఎస్ఆర్ఐ శానబోయిన రాజ్‌కుమార్ సమకూర్చిన పరీక్ష ప్యాడ్‌లను ఏబీఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి బొట్ల నరేశ్ శుక్రవారం పంపిణీ చేసి మాట్లాడారు. విద్యార్థులు ఆందోళనకు గురికాకుండా ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాయాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మంజుల, పొగాకు బాలకృష్ణ, నర్సింగరావు, రమేశ్, ఉపాధ్యాయినులు అనూశ, రమ, సంధ్య పాల్గొన్నారు.

ప్రజాసంక్షేమమే కాంగ్రెస్ లక్ష్యం

ఖానాపురం : ప్రజాసంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎడ్ల జగన్‌మోహన్‌రెడ్డి తెలిపారు. ఎమ్మెల్యే సీడీఎఫ్ నుంచి మంజూరైన ప్రత్యేక నిధులతో మండలంలోని రాగంపేట గ్రామంలో చేపట్టిన కుర్మ సంఘం భవన నిర్మాణానికి శుక్రవారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా జగన్‌మోహన్‌రెడ్డి మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలన్నిటినీ అమలు చేయనుందని చెప్పారు. పేదల సంక్షేమం కోసం అనేక పథకాలు అమలు చేస్తున్నట్లు తెలిపారు. గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించేలా అభివృద్ధి పనులు చేపట్టడానికి ప్రాధాన్యత ఇస్తున్నట్లు చెప్పారు. అన్ని వర్గాలకు కుల సంఘ భవనాలు నిర్మించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు హరిబాబు, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఎలగందుల రాజు, నాయకులు అబ్బులు, రమేశ్, రవీందర్, తదితరులు పాల్గొన్నారు.



భూమి పూజ చేస్తున్న జగన్‌మోహన్‌రెడ్డి, నాయకులు

ఈజీఎస్ పనులతో పేదలకు లబ్ధి

నెక్కొండ : జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులతో పేదలకు లబ్ధి చేకూరుతుందని ఎంపీటీసీ కర్ర సుకన్య తెలిపారు. ఈజీఎస్ కింద మండలంలోని పెద్దకోర్పోలు గ్రామంలో చేపట్టిన కాల్వల పూడికతీత పనులను ఆమె శుక్రవారం ప్రారంభించి మాట్లాడారు. ప్రభుత్వం వలసలు నివారించేలా పనులు చేపడుతోందని చెప్పారు. జాబ్ కార్డు కలిగిన ప్రతీఒక్కరికి పని కల్పించాలని, కొలతల ప్రకారం పనికి తగ్గ వేతనం ఇవ్వాలని, పని దినాలు పెంచాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో కిసాన్ సెల్ మండల అధ్యక్షుడు గై లక్ష్మణ్, ఫీల్డ్ అసిస్టెంట్ స్వరూప, నాయకులు కర్ర చిన్నారెడ్డి, బొడ్డుపల్లి యాదగిరి, మెండె రవీందర్, దయ్యాల ఐలయ్య, బొడ్డుపల్లి రాజేందర్ పాల్గొన్నారు.



పనులను ప్రారంభిస్తున్న ఎంపీటీసీ సుకన్య

కాంగ్రెస్‌లో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడి చేరిక

ఐనవోలు : బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు పోలెపల్లి శంకర్‌రెడ్డి గాంధీ భవన్‌లో మంత్రి సురేఖ, ఎమ్మెల్సీ మహేష్ కుమార్‌గౌడ్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. అనంతరం శంకర్‌రెడ్డి సీఎం రేవంత్‌రెడ్డిని, ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు.

దేవతా విగ్రహాల కోసం విరాళం

చెన్నారావుపేట : మండలంలోని పాపయ్యపేట గ్రామంలో తలపెట్టిన శ్రీకంఠ మహేశ్వరస్వామి ఉత్సవాల్లో భాగంగా శ్రీకంఠమహేశ్వరస్వామి, సురమాంబ దేవి దేవతల విగ్రహాల కోసం గ్రామానికి చెందిన మేడి రజిని-వెంకటేశ్వర్లు గౌడ్, మేడి ఉపేంద్రమ్మ-సాయిలు గౌడ్ శుక్రవారం రూ.75 వేల విరాళం అందించారు. ఈ సందర్భంగా దాతలను ఆలయ కమిటీ కార్యవర్గం అభినందించింది. కార్యక్రమంలో కుల పెద్ద మేడి ప్రభాకర్, గౌడ సంఘం అధ్యక్షుడు కత్తి స్వామి, మాజీ అధ్యక్షుడు బండి రమేశ్, నాయకులు బుర్ర సుదర్శన్, బుడిగె వెంకటేశ్వర్లు, బత్తిని ఏకాంబరం, చిర్ర శేఖర్ పాల్గొన్నారు.



నగదు అందిస్తున్న దాతలు

అవగాహనతోనే ఎయిడ్స్ నిర్మూలన

ఐనవోలు : అవగాహన పెంచుకోవడం ద్వారానే సమాజంలో ఎయిడ్స్‌ను నిర్మూలించగలమని మారి స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు తెలిపారు. మహాశివరాత్రి సందర్భంగా ఐనవోలు శ్రీమల్లికార్జునస్వామి ఆలయంలో జరుగుతున్న జాతర బ్రహ్మోత్సవాల్లో తెలంగాణ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆదేశాల మేరకు అధికారులు స్టాల్స్ ఏర్పాటు చేసి హెచ్ఐవీ ఎయిడ్స్ నియంత్రణపై అవగాహన కల్పించారు. డీఎంహెచ్ఓ, డిస్ట్రిక్ట్ ఎయిడ్స్ ప్రివెన్షన్ కంట్రోల్ యూనిట్ సహాయ సహకారంతో మారి వరంగల్, వైఆర్‌జీ, లింక్ వర్కర్స్ స్కీం ఆధ్వర్యంలో కరపత్రాలు పంపిణీ చేశారు. ఎంజీఎం ఆస్పత్రి ఐసీటీసీ కౌన్సిలర్ చంద్రమోహన్ హెచ్ఐవీ టెస్టులు చేశారు. కళారంజని సందీప్ కళాబృందం జాతరలో హెచ్ఐవీ ఎయిడ్స్‌పై ప్రదర్శనలు నిర్వహించారు. డీఏపీసీయూ నుంచి రామకృష్ణ, డీఐఎస్ కమలాకర్, రమేష్, మారి ప్రాజెక్టు మేనేజర్ విజయ్‌మోహన్, లింక్ వర్కర్ స్కీం సిబ్బంది పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న సంస్థ ప్రతినిధులు

బాధిత కుటుంబాలకు బియ్యం సాయం

రాయపర్తి : మండలంలోని గన్నారం గ్రామానికి చెందిన ఊడుగుల మల్లమ్మ, కత్తి యాకయ్య ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబాలకు సోల్జర్ యూత్ అసోసియేషన్ సభ్యులు శుక్రవారం బియ్యం అందజేశారు. అనంతరం పరామర్శించారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు నందనబోయిన సాంబశివ, సభ్యులు నందనబోయిన ప్రవీణ్, నందనబోయిన రాజు, అబ్బరబోయిన మహేశ్, మునిగెల శ్రీకాంత్, మునిగెల వంశీ, నందనబోయిన సాయికిరణ్, సాగర్, విక్కీ, ప్రభు తదితరులు పాల్గొన్నారు.



బియ్యం అందిస్తున్న యూత్ సభ్యులు